
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 43 | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-


# ఉద్యానవనంగా మార్కాపురం జిల్లా





- జులై 1కి వెలిగొండ నుంచి నీరు విడుదల
- మార్కాపురం జిల్లా దోర్నాల గంటావానిపల్లెలో సీఎం చంద్రబాబు పర్యటన
- వెలిగొండ ఫీడర్ కాలువ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం
- రైతులతో కలిసి ఫీడర్ కెనాల్ పనుల పరిశీలన

**అమరావతి**

ఈ ఏడాది జులై 1 నాటికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని జూన్ 15 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను నిర్దేశించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని పరిశీలించిన సీఎం అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం కొత్త జిల్లాగా ఏర్పడ్డాక తొలిసారి జిల్లాలో పర్యటించారు. దోర్నాలలోని గంటవానిపల్లె వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీజర్ కాలువ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు. వెలిగొండ పూర్తైతే భూగర్భజలాలు పెరిగి, బోర్లు, చెరువులకు నీళు వస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు, ఫీడర్ కాలువ పనులు వేగంగా సాగుతున్నాయని హర్షం వెలిబుచ్చారు. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన మీరే ప్రారంభోత్సవం కూడా చేయబోతున్నారంటూ సీఎంను ఉద్దేశించి రైతులు వ్యాఖ్యానించారు. రూ.2,500 కోట్ల విలువైన పనులు మిగిలి ఉన్నా పూర్తి చేయకుండానే గత పాలకులు ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు నాటకాలాడారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఫీడర్ కాలువ లైనింగ్ పనుల్ని పరిశీలించిన సీఎం అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 11,580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కాలువ పనులు చేపట్టామని అధికారులు వివరించారు. నల్లమలసాగర్ ప్రాంతంలో మూడు గ్యాప్స్ ఫిల్ చేయడం ద్వారా రిజర్వాయర్ ఏర్పడిందని ఇందులో 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఫ్లడ్ సీజన్ ప్రారంభమయ్యేనాటికి ఫీడర్ కాలువ సిద్ధమవుతుందని స్పష్టం చేశారు.

**సొరంగాలలో జరుగుతున్న పనులపై ఆరా**

ఈ సందర్భంగా స్థానిక చెరువులు నింపేందుకు స్ట్రక్చర్లు పూర్తి చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. వెలిగొండ టన్నెళ్లు పూర్తయ్యాక పోరుమామిళ్ల, రాచర్లకు కూడా నీరు వెళ్లేలా చర్యలూ తీసుకోవాలన్నారు. అనంతరం నల్లమలసాగర్ ఫీడర్ కెనాల్‌ను ఏరియల్ వ్యూ ద్వారా సీఎం తిలకించారు. జులై 1 నాటికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీరు ఇవ్వబోతున్నామని అధికారులకు స్పష్టం చేసిన సీఎం ఆ దిశగా పనులు - మిగతా3లో



## రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే వైసీపీ పనిగట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తోంది

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులు నేడు పూర్తి కావొస్తున్నాయని వెల్లడి
- రాజధాని లేని రాష్ట్రం నిందను పోగొట్టి, ప్రజలు మెచ్చే రాజధానిని నిర్మిస్తున్నామన్న మంత్రి
- తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ జరిగిందని అందరికీ తెలిసిందన్న మంత్రి

## సత్యసాయి జిల్లాను అభివృద్ధి బాటలో

# నడిపిద్దాం



జిల్లాలో హార్టికల్చర్, పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలం.

సత్యసాయి జిల్లా అభివృద్ధిపై జిల్లా మంత్రులు ,ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్,ఎస్పీలతోపాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.

**అంకుశం ప్రతినిధి విజయవాడ ఫిబ్రవరి 25**

సత్యసాయి జిల్లా అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని ఆ జిల్లా ఇన్చార్జి మంత్రి తోపాటు జిల్లాకు చెందిన మంత్రులు, జిల్లా కలెక్టర్ ఎస్పీ ఎమ్మెల్యేలు ఎంపీ తో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసంలో మంగళవారం రాత్రి జరిగిన సత్యసాయి జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మంత్రులకు ఎమ్మెల్యేలకు జిల్లా కలెక్టర్ ,ఎస్పీ లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. సత్యసాయి జిల్లా పండ్ల తోటల అభివృద్ధికి పరిశ్రమలతో పాటు ఐటీ రంగా - మిగతా2లో



## ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయి కానీ

- ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్
- ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు ఉండటంపై క్షమాపణలు చెప్పిన బిల్‌గేట్స్
- ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టీకరణ

2



## ఎన్నికల కోసం లగ్జరీ ప్రచార వాహనాలు

- రోల్స్ రాయిస్ తరహా ఫీచర్లు
- ధర రూ.కోట్లకు పైనే!
- కోయంబత్తూరులో అత్యాధునిక ఎన్నికల ప్రచార వాహనాలు తయారీ
- అందులో కంప్యూటర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు
- రోల్స్ రాయిస్ తరహా ఫీచర్లు!

2



## ఇళ్లంతా నోట్ల కట్టలే!

- ప్రభుత్వ అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం
- చరిత్రలో ఇదే తొలిసారి!
- ఒడిశాలో బయటపడ్డ మరో అధికారి బాగోతం
- గనుల శాఖ ఆధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం
- దేబబ్రత మహంతిని అరెస్టు చేసిన పోలీసులు
- భువనేశ్వర్‌లో రెండంతస్తుల భవనంలో 130 గ్రా.బంగారం గుర్తింప

## 'పాత నేతలు శాశ్వతంగా ఉండలేరు



- కొత్త తరాన్ని ఆహ్వానించాల్సిందే'
- డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు
- కర్ణాటక ఉపముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు
- కొత్త ఎమ్మెల్యేల డిమాండ్‌కు పూర్తి మద్దతు

# ఏపీలో బీసీ రిజర్వేషన్లు

**విజయవాడ :** స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. శాసనసభలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతోపాటు ఆహార పౌరసరఫరాలశాఖకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ల కోసం అభ్యర్థనపై చర్చ తర్వాత చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీయే పై ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించారు. ఆ నమ్మకాన్ని కాపాడుకోవాలి. వైసీపీ హయాంలో బీసీ రిజర్వేషన్లు 33 శాతం నుంచి తగ్గించారు. మళ్లీ వాటిని పెంచడానికి ఏకసభ్య కమిషన్ వేశాం. నివేదిక రాగానే చట్టం చేసి అమలుచేస్తాం. బీసీల రక్షణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేశాం. వారిచ్చే నివేదికను అమలు చేస్తాం. బీసీ వర్గాల్లోని కొందరు తమను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరారు. వాటిని కేంద్రానికి పంపాం అని తెలిపారు.బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తాం. ప్రజాప్రతినిధులు ఏ పనిచేసినా, దాని ద్వారా బలహీనవర్గాల్ని ఎంతవరకు ఆదుకుంటున్నామన్న సంగతి దృష్టిలో ఉంచుకోవాలి. ఇది బలహీనవర్గాల ప్రభుత్వం. వారికి అన్నివిధాలా అండగా ఉంటాం అని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ 1996'97లో తొలిసారిగా టీడీపీ ప్రభుత్వమే తెచ్చింది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడలేకపోయాయి. సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో మళ్లీ ఎస్సీ వర్గీకరణ అమలు చేసి దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేశాం అని తెలిపారు.




**తమ్ముళ్ల నిరాశ...**

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండగా కేసులకు భయపడకుండా అప్పటి ప్రభుత్వాన్ని ఎదిరించిన వారికి నేడు అధికారంలోకి వచ్చిన రెండేళ్లకు కూడా గుర్తింపు లేదని కార్యకర్తలు వాపోతున్నారు. మాజీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి కూడా చంద్రబాబు, లోకేశ్ లు కేవలం పాలనపై దృష్టి పెట్టకుండా పార్టీ క్యాడర్ గురించి ఆలోచిస్తే మంచిదని ఇటీవల ఒక యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అనేక మంది పార్టీకి చెందిన కార్యకర్తల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇతర పార్టీల నుంచి ఎన్నికలకు ముందు వచ్చిన వారికి ఉన్న గుర్తింపు గత ఐదేళ్లు జెండా మోసిన వారికి ఎక్కడుందంటూ సోషల్ మీడియాలో క్యాడర్ ప్రశ్నిస్తున్నారు.తెలుగుదేశం పార్టీ అభిమానిని అని చెప్పుకుని ముందు వరుసలో నిలబడిన చాలామంది అధికారంలో ఉండగా దూరం అవుతున్నారు. అంతే కాదు వారంతా టీడీపీ అని చెప్పుకునేందుకు ఇష్టపడటం లేదు. 2014 లో పార్టీ పిలుపు అందుకొని సమైక్య రాష్ట్రం కోసం పోరాటం, విభజిత ఆంధ్ర ప్రదేశ్ లో కేసీఆర్ ను సోషల్ మీడియాలో ఉతికి ఆరేయడం, జగన్ బ్యాచ్ దృష్టిలో పడి వాళ్ల అరాచకాలను ఎదుర్కోవడానికి అనేక తిప్పలు పడ్డ వారంతా నేడు సైలెంట్ అయ్యారు. వారిని స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో పాటు వైసీపీ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్య ఇవ్వడాన్ని కూడా తప్పుపడుతున్నారు. కార్యకర్తల సమావేశంలో తాము చంద్రబాబుతో నేరుగా ఫిర్యాదు చేయాలన్నా కొందరు అడ్డుకుంటున్నారంటున్నారు.2014 నుండి టీడీపీ ప్రభుత్వం లో ఏమాత్రం ప్రతిఫలం ఆశించకుండా పనిచేసిన వారు నేడు నాయకత్వానికి కనిపించకుండా పోవడం పట్ల ఆవేదన చెందుతున్నారు. సొంత డబ్బులు ఖర్చు చేసుకుని మరీ పార్టీని ముందుకు నడిపించినా అధికారంలోకి వచ్చినా ఏ మాత్రం ప్రయోజనం లేదని అంటున్నారు. 2019 చాప కింద నీరులాగా ప్రజల్లో నెగటివ్ టాక్ తో టీడీపీ ఓడిపోయింది. అయిదేళ్లు పార్టీ కోసం నిలబడిన వాళ్ళకు కేసులు , అప్పులు మిగిలాయన్న ఆవేదన వారిలో కనపడుతుంది. పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నో త్యాగాలు చేసిన కార్యకర్తలు, అభిమానులు కనుమరుగు అయిపోయారని వారు నెట్టింట ఆవేదన చెందుతున్నారు. అగ్రనేతల దృష్టిలో ఉన్న కొద్ది మందికి కార్పోరేషన్ల పదవులు దక్కాయని, మిగిలిన వారికి రిక్త హస్తాలు చూపుతున్నారంటున్నారు. మరి తమ్ముళ్ల ఆవేదన ఇప్పటికైనా పార్టీ అగ్రనాయకత్వం చెవికి చేరుతుందా? లేదా? అన్నది చూడాలి.

# మూడేళ్ల ముందు నుంచే లెక్కలు

ఆంధ్రప్రదేశ్ లో 2029 ఎన్నికలు ఇంకా మూడు సంవత్సరాల దూరంలో ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీల్లో ఇప్పటి నుంచే చురుకుదనం కనిపిస్తోంది. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ , ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , అలాగే కూటమిలో భాగమైన జనసేన పార్టీ తమ తమ స్థాయిలో వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రజాభిప్రాయాన్ని తమవైపు తిప్పుకునేందుకు ప్రతి పార్టీ వేర్వేరు మార్గాలను అనుసరిస్తోంది.ప్రస్తుతం అధికార కూటమిలో కీలక పాత్ర పోషిస్తున్న నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి పెట్టారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు వంటి అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిని బలోపేతం చేసి, ప్రజలకు ప్రత్యక్ష లాభాలు చేకూరేలా కార్యక్రమాలు చేపడితే అది ఎన్నికల సమయంలో తమకు అనుకూలంగా మారుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిప్రజా సమస్యలపై కఠిన వైఖరిని అవలంబిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో లోపాలను ఎత్తిచూపుతూ, తమ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తున్నారు. గ్రామ స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేసి, తిరిగి ప్రజల్లో నమ్మకం పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీ అంతర్గత వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం ద్వారా 2029లో బలంగా పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.జనసేన పార్టీకి నాయకత్వం వహిస్తున్న పవన్ కళ్యాణ్ యువత, మధ్యతరగతి వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, పార్టీ బలాన్ని పెంచే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయో చెప్పడం కష్టం అయినప్పటికీ, జనసేన తన ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని చూస్తోంది.ఏ పార్టీ ముందుందనే ప్రశ్నకు ఇప్పుడే స్పష్టమైన సమాధానం చెప్పడం



కష్టమే. ఎన్నికల ఫలితాలు అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, నాయకత్వంపై ప్రజల అభిప్రాయం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే యువ ఓటర్ల పాత్ర కూడా 2029 ఎన్నికల్లో ప్రధానంగా ఉంటుంది.రాజకీయంగా చూస్తే ప్రతి పార్టీ తన బలం, బలహీనతలను విశ్లేషించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పని చేసే పార్టీకి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంకా ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, ఇప్పటి చర్యలు భవిష్యత్తు ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. 2029లో ఏ పార్టీ ముందుంటుందో చెప్పడానికి సమయం ఇంకా ఉంది, కానీ సన్నాహాలు మాత్రం వేగంగా కొనసాగుతున్నాయి.

# ఆదర్శంగా ఎమ్మెల్సీ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ శాసనసభ.. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అత్యున్నత వేదిక. కానీ, దురదృష్టవశాత్తూ అది ఇప్పుడు 'గిఫ్ట్ కూపన్ల' కోసం ప్రజాప్రతినిధులు ఎగబడే సంతగా మారిందా? అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రానికి దిశానిర్దేశం చేయాల్సిన నేతలు, లక్ష రూపాయల ఉచిత వోచర్ల కోసం చేతులు చాచడం చూస్తుంటే.. ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకుంటోంది. ఈ చీకటి రాజకీయంలో ఒకే ఒక్కడు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, అందరికీ ఆదర్శంగా నిలిచారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. కొత్త అప్పు పుడితేనే పాత అప్పుకు వడ్డీ కట్టే దుస్థితి. సామాన్యుడిపై పన్నుల భారం, నిరుద్యోగుల ఆకలి కేకలు, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ ఫలాలు.. ఇన్ని సమస్యల మధ్య అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రజాప్రతినిధులందరికీ తలా రూ.1,00,000×× విలువైన షాపింగ్ కూపన్లు పంచడం ఏ రకమైన పరిపాలన?ప్రభుత్వ ఖజానా అంటే పాలకుల సొంత ఆస్తి కాదు, అది సామాన్య పౌరుడు చెమటోడ్చి కట్టిన పన్ను డబ్బు. ఆ డబ్బుతో ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు లక్షల రూపాయల 'నజరానాలు' ఇవ్వడం అనైతికం మాత్రమే కాదు, అప్రజాస్వామికం కూడా.అసెంబ్లీలో అడుగుపెట్టిన వారిలో అత్యధికులు వందల కోట్ల ఆస్తులున్న వారే. వారి కార్లు, వారి విలాసాలు, వారి జీవనశైలి సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉంటాయి. అలాంటి వారు కూడా, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే లక్ష రూపాయల వోచర్ కోసం క్యూ కట్టడం చూస్తుంటే.. వారి ఆశకు అంతం లేదా అనిపిస్తోంది. సొంతంగా లక్ష రూపాయల వస్తువులు కొనుక్కునే స్తోమత వీరికి లేదా? రాష్ట్రం కష్టాల్లో ఉన్నప్పుడు 'మాకు ఈ వోచర్లు వద్దు, ఆ డబ్బును పేదలకో, పాఠశాలలకో ఖర్చు చేయండి' అని చెప్పే దమ్ము ఒక్కరికైనా ఉందా?అందరూ ఆశకు దాసోహమన్న వేళ, గురుమూర్తి మాత్రం తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదు. చేతికి అందిన కూపన్‌ను నిర్మొహమాటంగా తిరస్కరించి, వెనక్కి ఇచ్చేసి.. రాజకీయ యవనికపై ఆదర్శంగా నిలిచారు. "రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఇలాంటి అనవసర వ్యయాలు ఎందుకు? ప్రజల సొమ్ముతో మాకు విలాసాలు అవసరమా?" ఆయన అడిగిన ఈ ఒక్క ప్రశ్న.. మిగిలిన ప్రజాప్రతినిధుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఆయన తిరస్కరించింది కేవలం ఒక కూపన్‌ను మాత్రమే కాదు, వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన 'అవినీతి', 'అనవసర వ్యయ' సంస్కృతిని!ఈ ఉదంతం ద్వారా పాలకపక్షం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. అసలు బడ్జెట్ సమావేశాల పేరిట ఇలాంటి కూపన్ల సంస్కృతిని ప్రవేశపెట్టడం వెనుక ఉద్దేశం ఏమిటి? ప్రజాప్రతినిధులను సంతృప్తి పరచడమే పాలన అని భావిస్తున్నారా? 200 మందికి పైగా సభ్యులకు లక్ష రూపాయల చొప్పున అంటే.. కోట్ల రూపాయల ప్రజాధనం గాలిలో కలిసిపోయింది. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పుడు పొదుపు పాటించాల్సింది పాలకులు. కానీ ఇక్కడ వేలితో చూపిస్తూ, నోటితో పొదుపు మంత్రాలు చదువుతూ.. చేతులతో మాత్రం ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారు.బొర్రా గోపిమూర్తి కేవలం ఒక ఎమ్మెల్సీ మాత్రమే కాదు, ఈ తరం రాజకీయ నాయకులకు ఆదర్శ పాఠం. ఆయన చూపిన బాటలో నడవడానికి ఏ ఒక్క ఎమ్మెల్యేకైనా మనసు వస్తుందా? ప్రజాధనాన్ని కాపాడటమే అసలైన దేశభక్తి అని ఆయన నిరూపించారు.

## ఉద్యానవనంగా మార్కాపురం జిల్లా

-మొదటిపేజీ తరువాయి

వేగంగా పూర్తిచేయాలని నిర్దేశించారు. సొరంగాలలో జరుగుతున్న పనులపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సీఎం చంద్రబాబు పురోగతిపై ఆరాతీశారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

### వచ్చే ఎన్నికల్లో నూరుశాతం స్ట్రైక్‌రేట్

అనంతరం మార్కాపురం ప్రజా వేదిక సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారుచేస్తామని తెలిపారు. ఈ ఏడాది వెలిగొండ ప్రాజెక్టుపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టుకు మొత్తం రూ.9 వేల 81 కోట్లు కావాలన్నారు. ఇప్పటివరకు తాము రూ.5 వేల 455 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వెలిగొండను 2 దశల్లో పూర్తి చేయాలని సీఎం నిర్ణయించామన్నారు. వెలిగొండ పూర్తి అయితే మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు ఎంతో లాభం కలుగుతుందన్నారు. ఉదయగిరి, బద్వేలుకు కూడా నీళు వెళ్తాయన్నారు. నల్లమలసాగర్‌కు గోదావరి నీరు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. "మార్కాపురం జిల్లా ప్రజలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని అప్పుడు కోరా. రాష్ట్రానికి మేలు చేసేందుకే పవన్ కల్యాణ్, నేను కలిశాం. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు మనదే హవా. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాల్లో నూరుశాతం స్ట్రైక్‌రేట్ కావాలి. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా, మాట నిలబెట్టుకున్నా. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా, చేశా. పోలవరం ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుంది. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పా, మాట నిలబెట్టుకున్నా. మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలు ఇచ్చాం." అని చంద్రబాబు తెలిపారు. " 3 వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చా. 1995లోనే మార్కాపురం ప్రజల కష్టాలు చూశా. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయి. 2014-19 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించాం. 2019-24 మధ్య వెలిగొండ పనులు మూలన పడ్డాయి. వెలిగొండ వల్ల 4.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు ఎంతో లాభం. ఇక్కణ్నుంచి ఉదయగిరి, బద్వేలుకు కూడా నీరు వెళ్తాయి. వెలిగొండ పనులు పూర్తయ్యాయని అప్పటి సీఎం ప్రారంభించారు. 2020లోనే వెలిగొండ పూర్తవుతుందని చెప్పి మిమ్మల్ని మోసం చేశారు." – సీఎం చంద్రబాబు

## ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

వైద్య చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇంకా ఏమైనా కేసులు నమోదవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం ఘటనలో ప్రస్తుతానికి 76 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. ఇద్దరు మినహా అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాను ఆపేశామని, ప్రత్యామ్నాయాల ద్వారా సురక్షితమైన తాగు నీటిని సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. రాజమహేంద్రవరం పాల ఘటనలో బాధితులు నిరంతర వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని అధికారులు తెలిపారు. పాల శాంపిళ్లను ఇప్పటికే ల్యాబ్?కు పంపామన్నారు. శాఖపరంగా దీనిపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని అధికారులు వెల్లడించారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించొద్దని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు రిపీట్ కాకుండా వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇదిలావుంటే రాజమహేంద్రవరం ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మృతి చెందారు. ఇప్పటికే ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ ఘటనలో పాలు సరఫరా చేసిన గణేష్?ను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు విచారణాధికారి, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. శ్రీకాకుళంలో మూడు రోజుల్లో 76 అతిసారం కేసులు నమోదయ్యాయి. అతిసారం ప్రబలటంపై సీఎం చంద్రబాబు మంగళవారం కూడా రెండుసార్లు జిల్లా అధికారులతో సమీక్షించారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే గొండు శంకర్ పరామర్శించారు. డయేరియాతో మృతి చెందిన సురేష్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం తరుపున 10 లక్షల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. అతిసారం ప్రబలడానికి తాగునీరు, కలుషితం కావడమే కారణమని అధికారులు అవమానిస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని వీధుల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పైపులైన్లు పగటటంతో వాటిలోకి మురుగు నీరు చేరిందని భావిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు: శ్రీకాకుళంలో డయేరియా పరిస్థితిపై మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మంత్రి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు సిబ్బందితో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు.

## రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే వైసీపీ పనిగట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తోంది

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఆ విషయాన్ని తట్టుకోలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పనిగట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోకి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులు నేడు పూర్తికావస్తున్నాయని అన్నారు. రాజధాని లేని రాష్ట్రం అనే నిందను పోగొట్టి, ప్రజలందరూ మెచ్చే రాజధానిని నిర్మిస్తుంటే ప్రజల దృష్టిని మరల్చడానికి సాక్షి టీవీ, పేపర్లను వాడుకుని వైసీపీ నాయకులు సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ జరిగిందనే విషయం చిన్నా పెద్దా అందరికీ తెలిసిపోయిందని అన్నారు. పామాయిల్, కెమికల్స్ వాడి నెయ్యిని అపవిత్రం చేసిన విషయం సిట్ (సిట్), సీబీఐ విచారణల్లో తేలిందని అన్నారు. ఇంత పాపం చేసినా భయం లేకుండా వైసీపీ నేతలు ఎదురుదాడి చేయడం దారుణమని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డికి, వారి ముఖ్య నాయకులకు హిందూ సంప్రదాయాల మీద గానీ, దేవుడి మీద గానీ కనీస భక్తి లేకపోవడమే దీనికి కారణమని ఆరోపించారు. మీ దగ్గర నిజం ఉంటే, ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ చేశారు. వారి మాటల్లో నిజం లేదు కాబట్టే అసెంబ్లీకి రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని 'ఎక్స్' ద్వారా, సొంత మీడియా ద్వారా విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మీరు రేపు ప్రజల్లోకి వెళ్లి పోటీ చేసే పరిస్థితి కూడా లేదని, కేవలం తాడేపల్లి కుర్చీల కోసమే మీరు కొట్టుకుంటారని విమర్శించారు. నెయ్యి సేకరణపై కూడా వైసీపీ నేతలు అజ్ఞానంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నందిని డైరీకి 40 లక్షల లీటర్ల ఆర్డర్ ఇచ్చామని, మొత్తం నెయ్యి అవసరంలో 62 శాతం నందిని, మదర్ డైరీల నుంచే సేకరిస్తున్నామని అన్నారు. మిగిలిన టెండర్లు ఇందాపూర్, సంఘం డైరీలకు దక్కాయని వెల్లడించారు. ఎన్డీడీబీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ ఉన్న ల్యాబొరేటరీల పరీక్షల తర్వాతే నెయ్యిని అనుమతిస్తున్నామని అన్నారు. పదేళ్ల క్రితం ఉన్న ధరలకే ఇప్పుడు కూడా నెయ్యి రావాలని కోరడం మీ తెలివితక్కువతనానికి నిదర్శనమని విమర్శించారు. మీ భారతీ సిమెంట్ వంటి ఇతర వస్తువుల ధరలు పెరిగినట్టే, నెయ్యి ధరలు కూడా పెరుగుతాయని తెలియదా? అని ప్రశ్నించారు. "కల్తీ నెయ్యి తినడం వల్ల మీకు బుద్ధిమాన్యం వచ్చిందేమో అనిపిస్తోంది. భక్తుల నమ్మకాన్ని కాపాడటం కోసం భవిష్యత్తులో ఎటువంటి కల్తీకి తావులేకుండా టీటీడీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన 'స్టేట్ ఆఫ్ ఆర్ట్' ల్యాబొరేటరీని ఏర్పాటు చేశాం. ఇప్పుడు ప్రతి ట్రక్కు నెయ్యిని క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాతే లడ్డూ తయారీకి అనుమతిస్తున్నాం. భక్తుల నమ్మకాన్ని కాపాడటమే మా ప్రభుత్వ లక్ష్యం. రాజశేఖర్ రెడ్డి గారు ఏడుకొండలను దివ్యక్షేత్రంగా చేశారని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నేతలు అసలు విషయాన్ని దాచేశారు. 2005లో జీవో నెంబర్ 338 ద్వారా తిరుమల పరిధిని కేవలం రెండు కొండలకే పరిమితం చేయాలని చూసింది వాస్తవం కాదా?" అని నిలదీశారు.

# తెలుగుదేశం పార్టీ విస్తరణే లక్ష్యం





**– ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ**

**అంకుశం న్యూస్ విజయవాడ ఫిబ్రవరి 25:** ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధి తెలుగుదేశం పార్టీ విస్తరణే మా ప్రధాన లక్ష్యం" అని ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ స్పష్టం చేశారు. తెలుగుదేశం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గొల్లపూడిలో నిర్మాణం చేయనున్న ఎన్టీఆర్ జిల్లా నూతన టీడీపీ కార్యాలయ నిర్మాణ స్థలాన్ని బుధవారం ఉదయం ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టి బాబు ఇతర టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. త్వరలో శుభముహూర్తంలో భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. స్థలాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం, భవన రూపకల్పన, విభాగాల వారీ కార్యాలయ గదులు, సమావేశ మందిరం, మీడియా సెంటర్, శిక్షణ హాల్, డిజిటల్ కమ్యూనికేషన్ విభాగం, కార్యకర్తల కోసం ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక సాంకేతిక వసతులతో, పారదర్శకతకు ప్రతీకగా నిలిచే విధంగా కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ జిల్లా పార్టీ కార్యాలయం కేవలం భవనం మాత్రమే కాకుండాపార్టీ కార్యకలాపాలకు శక్తివంతమైన కేంద్రంగా, కార్యకర్తలకు మార్గదర్శక వేదికగా, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయ కేంద్రముగా నిలిచేల నిర్మాణం చేస్తామన్నారు. టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ నాయకత్వంలో జిల్లా పార్టీ మరింత ప్రతిష్టను సంపాదిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ జిల్లా పార్టీ కార్యాలయం జిల్లా నడిబొడ్డున కార్యాలయం ఉండటం వల్ల అన్ని నియోజకవర్గాల ప్రజలకు, నాయకులకు సులభంగా చేరుకునే అవకాశముంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ పథకాల అమలుపై పర్యవేక్షణ, ప్రజల అభిప్రాయాల సేకరణ, సమస్యలపై సమర్థవంతమైన స్పందనకు ఈ కార్యాలయం కేంద్రబిందువుగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి టిడిపి ప్రెసిడెంట్ నూతలపాటి లతో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వండి

**– రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రికి పరిటాల సునీత**

**– శ్రీ సత్యసాయి జిల్లా నేతల సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత**

**– పేరూరు ప్రాజెక్ట్, బంగారు గనులతో పాటు పలు ప్రాజెక్టులపై వినతి**

**– పలువురు మంత్రులకు కూడా ఎమ్మెల్యే సునీత వినతులు**







**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 25:**రాప్తాడు నియోజకవర్గంలోని కీలకమైన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు పలువురు మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి పత్రాలు అందజేశారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన సమీక్షా సమావేశం నిర్వహించగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ప్రత్యేకంగా కొన్ని అంశాలు తీసుకెళ్లారు. ఇందులో ప్రధానంగా జీడిపల్లి-పేరూరు పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ కోసం భూములిచ్చిన రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం, రాక్రీట్ సంస్థ చేసిన అక్రమాలు, హంద్రీనీవా ప్రాజెక్టు ఫేస్-2, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1లక్ష 3వేల 362ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ డీపీఆర్ కు నిధులు, రేమాండ్స్ పరిశ్రమ ఏర్పాటు వేగవంతం చేయడం వంటివి ఉన్నాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో 4వేల ఎకరాల బీడు భూములలో హార్టికల్చర్ హబ్ లేక సోలార్ హబ్ ఏర్పాటు, గోరు చిక్కుడు పరిశ్రమ కోసం నిర్మించిన భవనాల్లో ఇతర పరిశ్రమలు ఏర్పాటు, రామగిరి బంగారు గనులను మళ్లీ ప్రారంభించడం వంటి వాటిపై విన్నవించారు. వీటితో పాటు నడిమివంకకు రక్షణ గోడ, ఆత్మకూరు, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలు, పంపనూరు, పండమేరు దేవాలయాల వద్ద పార్కులు, కనీస సౌకర్యాలకు నిధులు కేటాయించాలన్న అంశాలు ఉన్నాయి.

**మంత్రులకు కూడా పలు అంశాలపై విజ్ఞప్తులు**

బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత పలువురు మంత్రులను కలిసి నియోజకవర్గంలో సమస్యలు, అభివృద్ధిపై వినతి పత్రాలు అందజేశారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ను కలిసి త్మకూరు, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు రూ.2.80 కోట్లు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి రామగిరిలో ఎస్ఐ, 12 స్టాఫ్ క్వార్టర్స్ అసంపూర్తిగా ఉన్నాయని తక్షణమే మరమ్మతులు అవసరమైన 3కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణిని కలిసి నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయి.. మరికొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పిల్లలు, సిబ్బంది అవసరాలు, సౌకర్యాల దృష్ట్యా వీటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. మరోవైపు పశు సంవర్ధకశాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి అనేక వెటర్నరీ డిస్పెన్సరీలు, గ్రామీణ పశువుల యూనిట్లు, పశు పశువైద్య ఆసుపత్రులు శిథిలావస్థలో ఉన్నాయని వివరించారు. వాటి వివరాలు అందజేసి.. అక్కడ కొత్త భవనాలు నిర్మించి.. తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి నసనకోట ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 30 గ్రామాలలో భజన మందిరాలు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని కోరారు. ఎమ్మెల్యే సునీత వినతులపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. అన్నింటినీ పరిశీలించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు...

## జిల్లా జేపీసీ వైస్ చైర్మన్‌గా పి. శ్రీధర్ బాబు ఎన్నిక



**రాప్తాడు అంకుశం న్యూస్ ఫిబ్రవరి 25:** అనంతపురం జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమాఖ్య (జేఏసీ) జిల్లా వైస్ చైర్మన్‌గా రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ పి. శ్రీధర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటికే ఆయన ఏపీ ఎన్జీవో అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల ప్రతినిధిగా ఆయనను ఈ కీలక పదవికి ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన జిల్లా జేఏసీ చైర్మన్ మాధవ్ కు, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, 29% మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలన్నారు.

పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ బకాయిలు, తక్షణమే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డుల ద్వారా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. పెన్షనర్లకు రావలసిన అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు అనంతపురం జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హక్కుల రక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా ప్రకటించారు.

# అంగన్వాడీ కేంద్రాలు, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

**– అసెంబ్లీలో మరోసారి వాణి వినిపించిన ఎమ్మెల్యే పరిటాల సునీత**

**– అద్దె భవనాలు, పాత భవనాల్లో అంగన్వాడీలు ఉన్నాయన్న సునీత**

**– అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలని కోరిన సునీత**




**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 25:** అధ్యక్షా.. అంగన్వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యల్ని.. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని అసెంబ్లీ వేదికగా మరోసారి ఎమ్మెల్యే పరిటాల సునీత తన వాణి వినిపించారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో జీరో అవర్ లో ఆమె మాట్లాడుతూ పిల్లలకు తొలి గురువు అంగన్వాడీ కార్యకర్త అయితే.. తొలి పాఠశాల అంగన్వాడీ కేంద్రం అన్నారు. అలాంటి కొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవన్నారు. కొన్నిచోట్ల ఇంకా బాడుగ ఇళ్లలో కేంద్రాలు నడుస్తుండగా.. మరికొన్ని చోట్ల ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వంలో నాడు - నేడు అని చెప్పి కొన్ని అంగన్వాడీ కేంద్రాల పనులు మధ్యలో వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా టాయిలెట్స్ నిర్మాణాలు, త్రాగునీటి సౌకర్యం పనులు జరుగుతున్నాయన్నారు. చాలా చోట్ల అంగన్వాడీ కేంద్రాలకు కాంపౌండ్ వాల్స్ అడుగుతున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 55 నూతన అంగన్వాడీ భవనాలు మంజూరు చేయాలని.. అసంపూర్తిగా ఉన్న 32అంగన్వాడీ భవనాల పనులను పూర్తి చేయాలని కోరారు. 69 అంగన్వాడి కేంద్రాలకు కొత్త కాంపౌండ్ వాల్స్ మంజూరు చేయాలన్నారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలోనూ పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు అంగన్వాడీ ఆయాలకు ప్రమోషన్లు ఇచ్చారని.. అలాగే సెల్ ఫోన్లు ఇచ్చి వారి పనితీరు మెరుగుపడేలా చేస్తున్నారన్నారు. కానీ గత కొన్ని రోజులుగా వారు తమ దృష్టికి కొన్ని సమస్యల్ని తీసుకొస్తున్నారని వివరించారు. వారికి వేతనాలు తక్కువగా ఉన్నందున ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చూడాలన్నారు. ఇంకా వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా చొరవ చూపాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీత కోరారు..

## మార్చి 3న చంద్రగ్రహణం సందర్భంగా టిటిడి అన్నప్రసాద వితరణ కేంద్రాల మూసివేత

**అంకుశం న్యూస్ తిరుమల ఫిబ్రవరి 25 :**మార్చి 3వ తేదీ మంగళవారం రోజున చంద్రగ్రహణం సందర్భంగా తిరుపతి మరియు తిరుచానూరులోని తిరుమల తిరుపతి దేవస్థానాలు (టిటిడి) ఆధ్వర్యంలోని అన్నప్రసాద వితరణ కేంద్రాలను మూసివేయనున్నారు. ఇందులో భాగంగా తిరుచానూరులోని తోళ్లప్ప గార్డెన్స్‌లో గల ఎస్వీ నిత్య అన్నప్రసాద భవనం, తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని ఉద్యోగుల క్యాంటీన్, శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలోని క్యాంటీన్, అలాగే శ్రీనివాసం మరియు విష్ణునివాసం వసతి సముదాయాల్లో భక్తులకు అందించే ఉచిత అన్నప్రసాద వితరణను తాత్కాలికంగా నిలిపివేస్తారు. అదేవిధంగా తిరుపతిలోని ప్రభుత్వ వైద్యశాలలు మరియు వివిధ ప్రథమ చికిత్స కేంద్రాల్లో రోగులు మరియు వారి సంరక్షకులకు అందించే అన్నప్రసాదాలను ముందస్తుగా పంపిణీ చేయనున్నారు.

## చిన్నారి పునర్విక వైద్యం కోసం పి ఎం సహాయ నిధి రూ. 50 లక్షలు మంజూరు చేయించా.

**– నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



చిన్నారి పునర్విక తల్లిదండ్రులకు భరోసా ఇస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**అంకుశం న్యూస్ నంద్యాల ఫిబ్రవరి 25:** నంద్యాల పట్టణం బొమ్మల సత్రం లోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ కార్యాలయంలో ఇటీవల నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నిర్వహించిన ప్రజా దర్బార్‌లో చిన్నారి పునర్విక తల్లితండ్రులు తమ కుమార్తె అరుదైన వ్యాధితో బాధపడుతుందని, వైద్యం కోసం సహాయం కోరుతూ నా దృష్టికి తీసుకువచ్చారనీ. వారి ఆవేదనను విని వెంటనే స్పందించి, పునర్వికకు అవసరమైన వైద్య సహాయం తప్పకుండా అందిస్తామని భరోసా ఇచ్చాననీ, నా ప్రయత్నాల ఫలితంగా పునర్విక చికిత్స కోసం ప్రధాని సహాయ నిధి (PM Relief Fund) నుంచి రూ.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి బుధవారం అన్నారు. ఇది పునర్విక కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చే విషయమని, ఈ సహాయం సాధ్యమయ్యేలా సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కేంద్ర వైద్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని. ప్రజల ఆరోగ్యం నా మొదటి బాధ్యత అంటూ చిన్నారి పునర్విక త్వరగా కోలుకుని ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్షతో, ఆమె కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా ఇచ్చారు.

## ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదు

**– ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్**





**అంకుశం న్యూస్ కదిరి ఫిబ్రవరి 25:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం లోని కదిరి పట్టణంలో గలశ్రీ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఖాద్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ లతో కలిసి ఆయన ఏర్పాట్లను సమీక్షించారు. వేసవి దృష్ట్యా భక్తులకు చల్లని తాగునీరు, క్యూ లైన్లలో ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గారు సూచించారు.

బ్రహ్మోత్సవాలకు, ముఖ్యంగా రథోత్సవానికి భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని, ట్రాఫిక్ మళ్లింపుపై ప్రత్యేక ప్లాన్ సిద్ధం చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఆలయ పరిసరాల్లో 24/7 పారిశుధ్య పనులు నిర్వహించాలని, అత్యవసర వైద్య సేవలకు వీలుగా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్ మరియు దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఆలయ ఈఓ మరియు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గుడికట్ల పూజారులకు అండగా నిలవండి

**– మంత్రి ఆనంతో మంత్రి సవిత**



**అంకుశం ప్రతినిధి అమరావతి ఫిబ్రవరి 25 :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఎస్.సవిత కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాయలంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆమె మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుడికట్ల పూజారులకు సంబంధించిన సమస్యలపై దేవాదాయ శాఖ మంత్రి ఆనంతో మంత్రి సవిత చర్చించారు. రాష్ట్రంలో వ్యాప్తంగా 700ల వరకూ గుడికట్ల దేవాలయాలు ఉన్నాయన్నారు. వాటిలో ఉండే పూజారులు కురబ సామాజిక వర్గానికి చెందిన వారన్నారు. వారిని ఆదుకోవాల్సిన ఆశ్యకత ఉందన్నారు. దీనిలో భాగంగా వారికి గౌరవ వేతనం అందించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో చిన్న దేవాలయాలకు గౌరవం వేతనంతో పాటు ధూప, దీప, నైవేద్యాల కింద రూ.10 వేలు అందిస్తున్నారన్నారు. వారికి మాదిరే గుడికట్ల దేవాలయాల నిర్వహణకూ రూ.10 వేలు చొప్పున అందించాలని మంత్రి సవిత కోరారు. గుడికట్ల పూజార్ల సమస్యలపై మంత్రి ఆనంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. గుడికట్ల పూజార్ల సమస్యల పరిష్కారానికి అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట రాష్ట్ర కురుబల సంక్షేమ సంఘం, గుడికట్ల దేవాలయ పూజారుల ప్రతినిధులు ఉన్నారు.

## జిల్లాస్థాయి సైకిలింగ్ రేస్ లో ధర్మవరం

**– జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలు !**



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 25:** విద్యార్థినిలు ఘన విజయం సాధించి 28 1వ తేదీ విజయవాడ ఎన్టీఆర్ జిల్లా మున్సిపల్ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్నటువంటి రాష్ట్రస్థాయి సైకిల్ రేస్ ధర్మవరంవిద్యార్థిని లు సెలెక్ట్ అవ్వడం చాలా సంతోషకర విషయం అని భావిస్తూ అలానే రాష్ట్రస్థాయిలో కూడా మొదటి స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపిక అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అలానే పిల్లలకు క్రీడారంగంలో కూడా ప్రతి ఒక్కరూ పాల్గొని చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగించి మీ ఉజ్వ లమైన భవిష్యత్తును ఎన్నుకోవాలని కోరుకుంటూ అలానే ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో క్రీడా సర్టిఫికెట్ 3% రిజర్వేషన్ ఉండడం వలన చాలా ఉపయోగం పడుతుంది అలానే ఆరోగ్యంగా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడం కూడా జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ క్రీడలు నేర్చుకొని మీ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా మని హెచ్ఎం సుమనతో పాటు ఉపాధ్యాయ బృందం పిడి స్వరూప సరళ తో పాటు జూడో ఎన్ ఐ ఎస్ కోచ్ ఎస్ ఇ నాయక్ భాషా తెలియజేశారు.

# ప్రభుత్వం లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసే అవకాశం ఏమైనా ఉందా?

- కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను ఏజెన్సీలు సక్రమంగా ఇవ్వడం లేదు
- అసెంబ్లీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై గళం విప్పిన పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి.

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి ఫిబ్రవరి :25:** ప్రభుత్వం ద్వారా రూ. 20వేలు లోపు వేతనం పొందుతున్న కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో మంజూరు చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడలోని అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ద్వారా ప్రభుత్వ రంగాల్లో నియామకం పొంది రూ. 10 వేలు లోపు వేతనం తీసుకుంటున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ రైతు పథకాలు ఏవి వర్తించడం లేదని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అలాకాకుండా 20వేల లోపు వేతనం తీసుకుంటున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలలో ప్రత్యేక రాయితీ పొందే



వెసులుబాటు ప్రభుత్వం కల్పించాలని కోరారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చి 50,000 కాంట్రాక్ట్ ఉద్యోగులకు కాను కేవలం 3300 మందికి మాత్రమే కుదించిందన్నారు. చివరకు వారిని కూడా క్రమబద్ధీకరణ చేయకుండా వైసిపి ప్రభుత్వం వారికి తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో నైనా అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమపద్ధీకరణ చేసే అవకాశం ఏమైనా ఉందా అని ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రభుత్వాన్ని కోరారు

# మైనరు డ్రైవింగుతో చట్టపరమైన చిక్కులు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,
- మైనరు డ్రైవింగుకు స్వస్తి పలకాలని యువతకు పిలుపునిచ్చిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,

**అంకుశం న్యూస్ విజయనగరం ఫిబ్రవరి 25:** మైనరు డ్రైవింగుతో చట్టపరమైన చిక్కులు తప్పవని, 18సం.లు లోపు వయస్సు కలిగిన వ్యక్తులు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అటువంటి వ్యక్తులు డ్రైవింగు చేయుట వలన రహదారి ప్రమాదాలు, అనర్ధాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ ఫిబ్రవరి 24న అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - మైనర్లు వాహనాలు నడపడంలో తగినంత అనుభవం, ప్రమాదాలను అంచనా వేసే నేర్పు లేకపోవడం, వాహనాల వేగాన్ని నియంత్రించలేక పోవడం, ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు తరుచూ ఉల్లంఘించడం, రహదారి భద్రత ప్రమాణాలు పాటించక పోవడం వలన రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటాయన్నారు. మైనర్లు వాహనాలు నడుపుట వలన కలిగే అనర్ధాలకు వాహన యజమానులు, వారి తల్లిదండ్రులు చట్టరీత్యా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైతే ప్రమాద భీమాను చెల్లించేందుకు సదరు భీమా కంపెనీలు నిరాకరిస్తాయన్నారు.



మైనర్లుకు వాహనాలు నడిపే అర్హత లేని కారణంగా భీమా చెల్లింపులు నిరాకరిస్తే, ఆ ఆర్ధిక భారం కుటుంబంపైనే పడుతుందని, భీమా చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపైనే పడుతుందన్నారు. ఈ కారణంగా కుటుంబ సభ్యులు ఆర్ధికంగా సొమ్మును నష్టపోవాల్సి వస్తుందన్నారు. మైనర్లు వాహనాలు నడుపుటలో అనుభవం లేని కారణంగా ఇతరుల ప్రాణాలకు, రహదారిలో నడిచే వ్యక్తుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు.

కావున, వాహనదారులు, మైనర్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు నడిపే అర్హత (లైసెన్సు) లేకుండా డ్రైవింగుకు అనుమతించవద్దన్నారు. డ్రైవింగుకు సంబంధించి శిక్షణ పూర్తయి, నిర్దేశించిన వయస్సు వచ్చిన తరవాత లైసెన్సు పొంది, వాహనం నడిపే అర్హత సాధించిన తరువాతనే డ్రైవింగుకు ఉపక్రమించాలని కోరారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత పట్ల సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనరు డ్రైవింగు వలన కలిగే ఇబ్బందులు, అనర్ధాలను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడిపేందుకు మైనర్లు దూరంగా ఉండాలన్నారు.

# అనంతపురం నగర పరిసరాల్లో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేయండి

- అసెంబ్లీలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి దగ్గుపాటి
- టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్న మంత్రి సవిత

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 25:** అనంతపురం నగర పరిసర ప్రాంతాల్లో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు చేసి మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి నగరంలో పరిస్థితుల గురించి సభ దృష్టికి తీసుకెళ్లారు. అర్బన్ నియోజకవర్గంలో ప్రతి ఏటా జనాభా పెరుగుతోందని.. జిల్లాలోని అన్ని ప్రాంతాల వారు వచ్చి ఇక్కడ పిల్లల చదువుల కోసం, జీవనోపాధి, ఇతరత్రా వాటి కోసం స్థిరపడుతున్నాన్నారు. ఈ క్రమంలో మహిళలు చాలా మంది ఇళ్ల వద్ద ఖాళీగా ఉంటున్నారని.. వారికి పని చేయాలన్న ఆశ, అవసరం రెండూ ఉన్నాయన్నారు. మేము ఎన్నికల ప్రచార సమయంలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు చాలా మంది సంక్షేమ పథకాల కంటే ముఖ్యంగా ఉపాధి కల్పించమని అడిగారని గుర్తుచేశారు. నగరంలో ఉపాధి మరియు ఆదాయం అర్జించేలా ఎలాంటి అవకాశాలు లేవన్నారు. చాలా మంది షాపింగ్ మాల్స్, జువెలర్స్ దుకాణాల్లో చాలా తక్కువ వేతనాలకు పని చేస్తున్నారన్నారు. మహిళలు, తక్కువ చదువులకే ఆపేసిన వారు నగరంలో చాలా మంది ఉన్నారని.. ఇలాంటి వారి కోసం టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక భారీ టెక్స్ టైల్ పార్క్ అనంతపురం నగర పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే.. చాలా



మందికి ఉపాధి దొరికే అవకాశం ఉందని.. దానికి అనుబంధంగా మరికొన్ని చిన్న పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనుబంధ యూనిట్లు ద్వారా ఆర్థిక వనరులు పెరుగుతాయని దగ్గుపాటి వివరించారు. నైపుణ్యం ఆధారిత ఉపాధి ద్వారా ఈ ప్రాంతంలోని యువత, మహిళల సాధికారతకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి మా జిల్లా ఇన్ ఛార్జి మంత్రి టీజీ భరత్ కు కూడా విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై చేనేత,జౌళి శాఖ మంత్రి సవిత స్పందించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకుంటామని అనంతపురం పరిసర ప్రాంతాల్లో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు తగిన చర్యలు చేపడుతామన్నారు.

## రాష్ట్ర ప్రజలందరిపై ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలి: ఎంపీ కేశినేని శివనాథ్

- రాయనపాడులో శ్రీ సోమేశ్వర స్వామి వారి శివ మందిరంలో విగ్రహా ప్రతిష్ట హోత్సవం



**అంకుశం న్యూస్ విజయవాడ ఫిబ్రవరి 25:** రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆ భగవంతుడి కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రసరించాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామంలో చెరువు వద్ద నిర్మించిన శ్రీ సోమేశ్వర స్వామి వారి శివాలయంలో బుధవారం నిర్వహించిన శివలింగం, నందీశ్వరుడు, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు వేదమంత్రాల నడుమ ఆలయ మర్యాదలతో ఎంపీ కేశినేని శివనాథ్‌కు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన స్వామివారిని దర్శించుకుని రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన గ్రామ పెద్దలు, దాతలను అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల భావాలను పెంపొందిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు భక్తి, ఐక్యతకు ప్రతీకలని ఎంపీ పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## క్రికెట్ బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే పరిటాల సునీత

- శాసనసభ్యుల క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యే సునీత

**అంకుశం న్యూస్ విజయవాడ ఫిబ్రవరి 25:** నిత్యం రాజకీయాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా క్షేత్రంలో బిజీగా ఉండే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సరదాగా కాసేపు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల





నేపథ్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన శాసన సభ్యుల క్రీడా పోటీల్లో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. పల్లా శ్రీనివాస్- సత్యకుమార్ యాదవ్ టీమ్స్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరగ్గా మంత్రి సత్య కుమార్ టీంలో ఎమ్మెల్యే సునీత పాల్గొన్నారు. ఓపెనర్లుగా మంత్రి సవిత, ఎమ్మెల్యే సునీత దిగారు. క్రికెట్ బ్యాట్ పట్టుకుని ఉత్సాహంగా ఆడుతూ సందడి చేశారు. త్రో బాల్ పోటీలు పరిటాల సునీత వర్సెస్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి టీమ్ ల మధ్య జరిగాయి. ఈ పోటీల్లో ఎమ్మెల్యే సునీత టీం గెలుపొందింది. టెన్నికాయిట్ పోటీలు ఎమ్మెల్యేలు సునీత, సింధూర మధ్య జరిగాయి. ఈ పోటీలో సింధూర గెలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రజాప్రతినిధులంతా ఒకచోట ఇలా క్రీడా పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది అందరి మధ్య ఒక స్నేహపూర్వకమైన వాతావరణం ఉండటానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు....

## పన్నులు కట్టి పంచాయితీల అభివృద్ధికి తోడ్పడండి



**.పోరుమామిళ్ల, ఫిబ్రవరి 25(అంకుశం పత్రిక):** పన్ను వసూలకు ప్రజలు సహకారం అందించి పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని బద్వేల్ డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకట శేషయ్య అన్నారు. బుధవారం మండలములోని రంగసముద్రం, పోరుమామిళ్ల పంచాయతీలలో చేపట్టిన పన్ను వసూలు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజలు ఆన్లైన్లో మాత్రమే పన్నులు చెల్లించాలని సూచించారు. పంచాయతీల అభివృద్ధికి పన్నులు కీలకంగా ఉంటాయని, అవి పూర్తిస్థాయిలో చెల్లించినప్పుడే గ్రామాలు బలోపేతం అవుతాయని అన్నారు . పోరుమామిళ్ల రంగసముద్రం పంచాయతీలలో పన్ను వసూలుకు మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధి అధికారులను కేటాయించామన్నారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు వరకు పన్ను వసూలు డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు.

## రాష్ట్ర అసెంబ్లీలో కళ కళలాడిన “ధర్మవరం “పట్టు వస్త్రాలు !



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 25:** ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను సందర్శించిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత. స్టాళ్లు ప్రారంభమై అయిదు రోజుల నుంచి జరిగిన అమ్మకాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్న మంత్రివర్యులు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారని, అమ్మకాలు బాగా జరుగుతున్నాయని వివిధ జిల్లాలకు చెందిన నేతన్నలు ఆనందం వ్యక్తంచేశారు. మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి కూడా చేనేత స్టాళ్లను సందర్శించారు. మంత్రులకు ఆయా ప్రాంతాలకు చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను మంత్రి సవిత వివరించారు. ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, భూమా అఖిలప్రియ కూడా చేనేత స్టాళ్లను సందర్శించి చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారులివీటిలో ధర్మవరం పట్టు వస్త్రాలు కూడా ఉండడం విశేషం.

## వయోజన విద్యతోనే గ్రామాల అభివృద్ధి

- ఎంపీడీఓ బి.విజయలక్ష్మి



**రాప్తాడు, అంకుశం న్యూస్, ఫిబ్రవరి 25:** వయోజన విద్యతో ప్రజల్లో చైతన్యం వస్తుందని, దీంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి అన్నారు. నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన ఉల్లాస్-అక్షర ఆంధ్ర‘ కార్యక్రమంపై అవగాహన కల్పించే పోస్టర్లను బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ద్వామా ఏపీఓ సావిత్రితో కలిసి విడుదల చేశారు. అనంతరం మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు బోధనా సామాగ్రిని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చదువుకోవడానికి వయస్సు అడ్డంకి కాదని, ప్రతి ఒక్కరూ అక్షర జ్ఞానం కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లోని వయోజనులకు రాత్రిపూట తరగతులు నిర్వహించి వారికి కనీస రాయడం, చదవడం నేర్పించేలా గతంలోనే వాలంటీర్లను ఎంపిక చేశామని, ప్రస్తుతం వారికి అవసరమైన పుస్తకాలు, ఇతర మెటీరియల్‌ను పంపిణీ చేశామన్నారు. పగటిపూట పనులకు వెళ్లే వయ జనుల సౌకర్యార్థం రాత్రి వేళల్లో తరగతులు నిర్వహించబడతాయన్నారు. ఎంపిక చేయబడిన వాలంటీర్లు గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరాలు నేర్పిస్తారన్నారు. కేవలం చదువే కాకుండా డిజిటల్ మరియు ఆర్థిక అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పిస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలకు విశేష ఆదరణ

- బస్టాప్ లలో డిజిటల్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుతో ఉచిత బస్సు సేవలకు కొత్త ఊపు
- రోజుకు 60 వేల మంది భక్తులు ఉచిత బస్సుల్లో ప్రయాణం



**అంకుశం న్యూస్ తిరుమల ఫిబ్రవరి 25:** తిరుమలలో భక్తుల సౌకర్యార్థం టీటీడీ నిర్వహిస్తున్న శ్రీవారి ధర్మ రథాలు (ఉచిత బస్సు సేవలు) డిజిటల్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుతో మరింత ప్రజాదరణ పొందుతున్నాయి. బస్సులు వచ్చే సమయాన్ని భక్తులు ముందుగానే తెలుసుకునేలా డిజిటల్ డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వేచిచూసే సమయం తగ్గి, ఉచిత రవాణా సేవలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో మొత్తం 12 ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు ఈ సేవలో ఉన్నాయి. రోజుకు సగటున 300 ట్రిప్పులు నిర్వహిస్తూ, ఒక్కో ట్రిప్పు సుమారు 6.5 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తోంది. ఈ విధానం దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోసం ప్రత్యక్ష బస్సు సమాచారం అందించే తొలి సాంకేతిక ప్రయోగంగా నిలుస్తోంది.

**రోజుకు 60 వేల మంది భక్తులు సురక్షితంగా ప్రయాణం**

బస్సుల ప్రత్యక్ష స్థానం, వచ్చే సమయాన్ని డిజిటల్ డిస్ప్లే ద్వారా భక్తులకు తెలియజేయడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు సుమారు 60 వేల మంది భక్తులు ఈ ఉచిత బస్సు సేవలను వినియోగిస్తూ సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు.

**తగ్గిన ప్రైవేట్ ట్యాక్సీల ప్రయాణం - పెరిగిన ప్రజా రవాణా వినియోగం**

గతంలో ఉచిత బస్సు వచ్చే సమయం ముందుగా తెలియకపోవడంతో భక్తులు ప్రైవేట్ ట్యాక్సీల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపేవారు. దీంతో ట్యాక్సీ డ్రైవర్లు భక్తుల నుండి అధిక ధరలను వసూలు చేసేవారు. ఈ సమస్యను గుర్తించిన టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని తిరుమలలోని 20 బస్టాప్ లలో బస్సుల ప్రత్యక్ష సమయం తెలిసేలా డిజిటల్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను హైదరాబాద్ కు చెందిన బి.ఎస్.టెక్నోట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డిజిటల్ బోర్డులను విరాళంగా అందివ్వగా, ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ విధానం అమలు చేసినప్పటి నుండి బస్టాప్ వద్దకు వచ్చిన భక్తులకు బస్సు వచ్చే సమయం ప్రత్యక్షంగా తెలియడం, 10 నిమిషాల లోపే బస్సులు రావడంతో భక్తులు ఉచిత బస్సు సేవలను విరివిగా వినియోగించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ సౌకర్యం ఎంతో ఉపయోగరంగా ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఇంధన వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ తోడ్పాటు**

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం ద్వారా ఇంధన వినియోగం తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా ఈ సౌకర్యం దోహదపడుతోంది. అదేవిధంగా తిరుమలలో వాహన రద్దీని తగ్గించి కాలుష్య నియంత్రణ దిశగా పటిష్టమైన ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి, భక్తులకు సౌకర్యవంతమైన, పర్యావరణ హితమైన రవాణా అందించాలనే లక్ష్యంతో టీటీడీ ఈ విధానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది.